సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 30 । మే । 2023

జయహో.. జగన్

- నాలుగేళ్ల పాలనపై హర్షం
- బైక్ ర్యాలీలు, కేక్ కటింగ్‌లతో సంబరాలు
- స్వచ్ఛందంగా తరలిన ప్రజలు

8లో



బాబుకు రాజకీయ సమాధే

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- జగనన్నకు మద్దతుగా భారీ ర్యాలీ



ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆధ్వర్యంలో హౌసింగ్ లబ్ధిదారుల భారీ ర్యాలీ

ధర్మవరం: అద్దె ఇంట్లో అవస్థలు పడుతూ దుర్భర జీవితం అనుభవించే నిరుపేదలను అపహాస్యం చేస్తూ సమాధులతో పోల్చిన ప్రతిపక్ష నేత చంద్రబాబుకు రాజకీయ సమాధి తప్పదని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ధర్మవరం పట్టణంలో వేల సంఖ్యలో ఇళ్లను పేదలకు కేటాయించి ఊళ్లను నిర్మిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంఘీభావం తెలుపుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులు సోమవారం భారీ ర్యాలీ చేపట్టారు. శివానగర్‌లోని బచ్చునాగంపల్లి కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శివానగర్ నుంచి దిమ్మెల సెంటర్ మీదుగా తేరుబజార్, అంజుమన్ సర్కిల్, పీఆర్‌టీ సర్కిల్, కళాజ్యోతి సర్కిల్ మీదుగా వేలాది మంది లబ్ధిదారులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాలేజ్ సర్కిల్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 30 లక్షలకు పైగా ఇంటిస్థలాలను కేటాయించి ఇళ్లను కాకుండా ఏకంగా ఊళ్లను నిర్మిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు కోర్టులకు వెళ్లి అడ్డుపడినా దృఢ సంకల్పంతో వారి కుట్రలను తిప్పి కొట్టారన్నారు. ఇటీవల రాజధాని ప్రాంతంలో నిరుపేదల కోసం 1,400 ఎకరాల్లో 50 వేల పట్టాలను ఒకేసారి పంపిణీ చేసి రికార్డు సృష్టించారన్నారు. చేనేతలు, నిరుపేదలు అత్యధిక సంఖ్యలో నివసించే ధర్మవరం నియోజకవర్గంలో 13 వేలకు పైగా ఇంటిపట్టాలను పంపిణీ చేసి అన్ని సదుపాయాలతో లేఅవుట్‌లు వేశామన్నారు. తాము అధికారంలోకి వస్తే లాక్కుంటామని ఎల్లో మీడియాలో ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. పేదల ఇంటి పట్టాలను లాక్కునేంత దమ్ముందా అని సవాల్ విసిరారు. తమది పేదలకు మంచి చేసే ప్రభుత్వమని, వారిది ప్రజలను ముంచే మనస్తత్వమన్నారు. నిరుపేదలు బాగుపడితే టీడీపీ నేతలు ఓర్వలేరన్నారు. సీఎం జగన్ నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజా మద్దతుతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజారిటీతో గెలుస్తుందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అవుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ ఎర్రగుంట భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ పెణుజూరు నాగరాజు, పట్టణ సచివాలయాల కన్వీనర్‌లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్‌లతో పాటు 40వార్డుల కౌన్సిలర్‌లు, ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

పొలాలు కళకళలాడాలి

- రాయితీ విత్తన పంపిణీలో కలెక్టర్, ఎమ్మెల్యే దుద్దుకుంట

పుట్టపర్తి అర్బన్: 'ఖరీఫ్‌లో జిల్లా రైతుల కోసం జగన్ సర్కార్ రూ.35 కోట్ల మేర రాయితీ ఇచ్చి విత్తనాలు అందజేస్తోంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పొలాలన్నీ పంటలతో కళకళలాడాలి' అని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు పుట్టపర్తిలోని ఎనుములపల్లి రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతు ముంగిళ్లలోనే విత్తన పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం 40 శాతం సబ్సిడీపై విత్తన కాయలను అందిస్తోందన్నారు. ఇక చిరుధాన్యాలైన రాగులు, కంది, పెసర, ఉలవ, జీనుగ విత్తనాలను 50 శాతం సబ్సిడీతో అందజేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎనుములపల్లి రైతులకు విత్తన కాయలు అందజేశారు. కార్యక్రమంలోఆర్డీఓ భాగ్యరేఖ, అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, డీఏఓ సుబ్బారావు, ప్రత్యేకాధికారి డాక్టర్ శుభదాస్, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, అగ్రి బోర్డు మండల చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

క్లుప్తంగా

మార్కెటింగ్ శాఖలో ముగ్గురి బదిలీ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా మార్కెటింగ్ శాఖ పరిధిలో ముగ్గురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు అందినట్లు ఆ శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏడీఎం ఆఫీస్‌లో జూనియర్ మార్కెటింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్షావలి.. కర్నూలు జిల్లా ఏడీఎం ఆఫీస్‌కు, రాయదుర్గంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ పోతక్కను తాడిపత్రికి, తాడిపత్రి నుంచి సూపర్‌వైజర్ చంద్రానాయక్‌ను శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లకు బదిలీ చేశారు.

ఏఎస్పీ విష్ణు బాధ్యతల స్వీకరణ



ఎస్పీ మాధవరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు ఎస్పీ విష్ణు

కొత్తచెరువు: జిల్లా నూతన అదనపు ఎస్పీగా ఎస్.విష్ణు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆ స్థానంలో పనిచేసిన కె.వి.రామకృష్ణప్రసాద్‌ను విజయవాడ సెబ్ ఏఎస్పీగా బదిలీ చేశారు. సెబ్ డీఎస్పీగా పని చేస్తున్న విష్ణుకు పదోన్నతి కల్పిస్తూ జిల్లా అదనపు ఎస్పీగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

వివాహిత హత్య కేసులో ముద్దాయికి జైలు శిక్ష

కదిరి టౌన్: వివాహిత హత్య కేసులో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ కోర్టు జిల్లా జడ్జి శ్రీనివాస్ తీర్పు వెలువరించారు. వివరాలు.. కదిరిలోని ఎన్జీవో కాలనీకి చెందిన కుమర్మ మల్లేశ్వరికి గుజ్జల అశోక్‌కుమార్‌తో వివాహేతర సంబంధం ఉండేది. ఈ విషయంగా రెండు కుటుంబాల మధ్య వివాదం చెలరేగడంతో అశోక్‌కుమార్ తన కుటుంబాన్ని తిరుపతిలోని అంబేడ్కర్ నగర్‌కు మార్చాడు. 2017, ఆగస్టు 30న మల్లేశ్వరిని కలిసేందుకు కారులో వచ్చాడు. అప్పటికే కొక్కంటి క్రాస్ వద్ద వేచి ఉన్న మల్లేశ్వరిని కారులో ఎక్కించుకుని తనకల్లు మండలం మండ్లపల్లి సమీపంలోని మామిడి తోపులోకి చేరుకున్నాడు. ఇద్దరూ జీవనం సాగిస్తామని మల్లేశ్వరి కోరగా అశోక్ కుమార్ ఒప్పుకోలేదు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటామాటి పెరగడంతో తన కారులో ఉన్న కొడవలితో ఆమెను హతమార్చాడు. అనంతరం కారుతో సహ తనకల్లు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. అప్పటి నుంచి కేసు వాదనలు కొనసాగుతూ వచ్చాయి. పలువురు సాక్షులను విచారించిన అనంతరం ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ అనంతపురం జిల్లా జడ్జి శ్రీనివాస్ తీర్పు వెలువరించారు.

నవశకానికి నాలుగేళ్లు

- సంక్షేమం.. అభివృద్ధి దిశగా జగన్ సర్కార్ నాలుగేళ్ల పాలన
- కుల, మత, రాజకీయాలకతీతంగా ప్రజలకు నేరుగా లబ్ధి
- ఉమ్మడి అనంత జిల్లాలో పారిశ్రామికంగా కొత్త శకం
- పీహెచ్‌సీలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లతో ఆరోగ్యానికి పునరుజ్జీవం
- అనంత మెడికల్ కాలేజీకి భారీ వ్యయంతో కొత్త భవనాలు
- జగనన్న కాలనీల ఏర్పాటుతో నెరవేరిన పేదల సొంతింటి కల
- సచివాలయాలతో ఇంటి వద్దకే పాలన
- ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్టుతో పల్లె ముంగిటకే వైద్యం
- రీ సర్వే, చుక్కల భూములకు విముక్తి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి.. పోయాయి. ఎందరో ముఖ్యమంత్రులు వచ్చారు.. వెళ్లారు. కానీ గత చరిత్రలను తిరగరాసి, గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని ఏర్పాటు చేసి కొత్త చరిత్రకు నాందిపలికింది వైఎస్ జగన్ సర్కార్. దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ అమలుచేయని విధంగా గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా సేవల్లో కొత్త ఒరవడి నాంది పలికింది. సంక్షేమం అంటే ప్రజలు..ప్రజలంటేనే సంక్షేమం అన్న పదానికి నిర్వచనం చెప్పింది. రేషన్ కార్డు మొదలుకొని సామాజిక పెన్షన్ల వరకూ కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులకు అందజేస్తూ అందరి ప్రభుత్వంగా పేరుగాంచింది... ఇలా వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో లెక్కలేనన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి పేదల ముఖాల్లో చిరునవ్వు చిందేలా చూస్తోంది.

చదువులకు పెద్దపీట

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది స్కూళ్లలో నాడు నేడు పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ బడులు ప్రైవేటు స్కూళ్లను తలపిస్తున్నాయి. అడ్మిషన్ల సంఖ్య భారీగా పెరిగింది. డ్రాపౌట్లు తగ్గుముఖం పట్టాయి. ప్రతి తల్లీ తన బిడ్డను బడికి పంపితే అమ్మఒడి కింద రూ.15 వేలు ఇస్తున్నారు. స్కూళ్లలో మరుగుదొడ్ల నుంచి మంచినీళ్ల కుళాయిల వరకూ అన్నీ ఏర్పాటు చేశారు. ఇదొక్కటే కాదు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనకు నేరుగా సొమ్ములిస్తున్నారు. విదేశీ విద్యాదీవెన ద్వారా ఒక్కో విద్యార్థిపై గరిష్టంగా రూ.కోటి ఖర్చు చేసే జగనన్న విదేశీ విద్యాదీవెన అందుబాటులోకి తెచ్చి పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందుబాటులోకి తెచ్చారు.

చుక్కల భూములకు విముక్తి

గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వైఎస్సార్ సీపీ సర్కారు వందేళ్ల క్రితం ఉన్న రికార్డులను సవరించి రీసర్వే చేపట్టింది. వివాదాల్లేని భూముల చిట్టాను తయారు చేస్తోంది. ఇప్పటికే అనంతపురం జిల్లాలో 43 గ్రామాల్లో సర్వే పూర్తయింది. అలాగే 22-ఏలో ఉన్న భూములపై సాగుదారులకు హక్కులుండేవికావు. జగన్ సర్కారు అలాంటి భూములన్నిటికీ విముక్తి కల్పించి రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించింది.

మెడికల్ కాలేజీలకు మహర్దశ


అనంతపురం మెడికల్ కాలేజీకి మహర్దశ వచ్చింది. రాష్ట్రంలో జగన్ సర్కార్ కొలువుదీరినప్పటి నుంచి ఇప్పటివరకూ అనంత మెడికల్ కళాశాలకు ఏకంగా 70 పీజీ సీట్లు అదనంగా వచ్చాయి. మరో రూ.450 కోట్లతో అదనపు కాలేజీకి కొత్త భవనాలకు పనులు ప్రారంభమయ్యాయి. ఇక శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ వద్ద మెడికల్ కాలేజీ ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 2026 నాటికి ఈ కాలేజీ అందుబాటులోకి రానుంది.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో కొత్త చరిత్ర

ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థ దేశంలోనే కొత్త చరిత్ర సృష్టించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజల వద్దకే వైద్యం వెళ్లింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఫ్యామిలీ ఫిజీషియన్‌తో కొత్త భరోసా వచ్చింది. ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ విధానంలో డయాబెటిక్, హైపర్ టెన్షన్‌తో పాటు పలు అసాంక్రమిక వ్యాధులను గుర్తించి వైద్యం చేస్తున్నారు.

ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు

ఒకప్పుడు పీహెచ్‌సీకి వెళితే వైద్యులే కనిపించేవారు కాదు. నాలుగేళ్లలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఇద్దరు వైద్యులను నియమించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితిలోనైనా అక్కడే వైద్యం అందించేలా ఏర్పాటు చేశారు. దీంతో పాటు వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేసి మిడ్‌లెవెల్ హెల్త్‌ప్రొవైడర్‌ను నియమించారు. దీంతో తమ సొంత గ్రామంలోనే వైద్యం అందే పరిస్థితులు కల్పించారు.





గ్రామ వార్డు సచివాలయాలతో

సచివాలయ వ్యవస్థ దేశంలోనే ఒక చరిత్ర. ప్రభుత్వాఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే సంప్రదాయానికి జగన్ సర్కార్ స్వస్తి పలికింది. ప్రతి రెండువేల మంది జనాభాకు గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఎలాంటి సమస్యనైనా గ్రామం నుంచే పరిష్కరించుకునేలా చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1,207 సచివాలయాలను ఏర్పాటు చేసింది. రేషన్ కార్డు నుంచి ఇంటిపట్టా వరకూ అన్ని పనులకూ సచివాలయమే వేదిక అయ్యింది. అలాగే వేలాది మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించింది.

ఉమ్మడి జిల్లాలో వార్డు/గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలు	
అనంతపురంలో	
గ్రామ/వార్డు సచివాలయాలు	663
మంజూరైన పోస్టులు	11,585
పనిచేస్తున్న వారు	11,461
శ్రీసత్యసాయి జిల్లాలో	
గ్రామ/వార్డు సచివాలయాలు	544
మంజూరైన పోస్టులు	11,585
పనిచేస్తున్న వారు	11,461



పంటల బీమా మెగా చెక్ విడుదల చేస్తున్న సీఎం వైఎస్ జగన్ (ఫైల్)

రైతుకు భరోసా

రైతే రాజు అని అని నమ్మిన ప్రభుత్వమిది. వైఎస్సార్ రైతు భరోసా పేరిట (పీఎం కిసాన్) పేరుతో 5.76 లక్షల మంది రైతుల ఖాతాల్లో ఏడాదికి రూ.728 కోట్ల చొప్పున నాలుగేళ్లలో రూ.3 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ అయ్యింది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద గత ఏడాది రికార్డు స్థాయిలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు రూ.855 కోట్లు మంజూరైంది. మూడేళ్లలో రూ.1,200 కోట్లకుపైగా అందింది. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల కింద రూ.120 కోట్ల మేర రైతులకు అందింది. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.250 కోట్లు, ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు రూ.14 కోట్లు అందజేసింది. డ్రిప్, స్ప్రింక్లర్లు కింద రూ.350 కోట్లు వ్యయం చేసింది. విత్తనం వేరుశనగ, పప్పుశనగ సబ్సిడీ కింద జగన్ సర్కార్ నాలుగేళ్లలో ఏకంగా రూ.500 కోట్లు వ్యయం చేసింది.

నాలుగేళ్లలో ఉమ్మడి జిల్లా రైతులకు చేకూరిన లబ్ధి	
వైఎస్సార్ రైతు భరోసా -పీఎం కిసాన్	రూ.1,557 కోట్లు
రైతు ఆత్మహత్యలకు పరిహారం	రూ.12 కోట్లు
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	రూ.978 కోట్లు
పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్‌సబ్సిడీ)	రూ.128 కోట్లు
వైఎస్సార్ పంటరుణాల సున్నావడ్డీ	రూ.54 కోట్లు
విత్తన రాయితీలు	రూ.290 కోట్లు
డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ	రూ.275 కోట్లు
సీహెచ్‌సీల కింద ట్రాక్టర్లు, పరికరాలు	రూ.27 కోట్లు
వ్యవసాయ, అనుబంధ పథకాలకు	రూ.120 కోట్లు



నాలుగేళ్లలో లక్ష మందికి పైగా..

వైఎస్సార్ ప్రవేశపెట్టిన 108 అంబులెన్సు వ్యవస్థ 2019 నాటికి పూర్తిగా నిర్వీర్యమైంది. దీంతో బాధితులు బిక్కు బిక్కుమనే పరిస్థితి. దీంతో అధికారంలోకి వచ్చీరాగానే జగన్ సర్కారు 108 వ్యవస్థపై దృష్టి సారించింది. మండలానికొక 108 అంబులెన్సును ఏర్పాటు చేసింది. దీంతో ఏ రాష్ట్రంలో లేని విధంగా సర్వీసులు మెరుగు పడ్డాయి. దీనికి తోడు మండలానికొక 104 వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఇంటివద్దకే వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నాయి. కరోనా సమయంలో 108 అంబులెన్సులే పెద్దదిక్కుగా ఉన్నాయి.

2020-23 మధ్య అంబులెన్సుల వ్యవస్థ ఇలా	
మొత్తం అంబులెన్సులు	66
ఏఎల్ఎస్	15
బీఎల్ఎస్	49
నియోనేటల్	02
ఎమర్జెన్సీ టెక్నీషియన్స్	165
డ్రైవర్స్	165
లబ్ధిదారుల సంఖ్య	2,90,645



పారిశ్రామికాభివృద్ధి పరుగులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పారిశ్రామిక వృద్ధి పరుగులు పెడుతోంది. సరళీకృత పారిశ్రామిక విధానాలను అమల్లోకి తేవడంతో ఇతర రాష్ట్రాల పెట్టుబడిదారులు కూడా ఇక్కడకు వస్తున్నారు. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

అనంతపురం జిల్లాలో పరిశ్రమలు ఇలా	
పెద్ద ప్రాజెక్టులు	02
పెట్టుబడులు	712.8 కోట్లు
ఉద్యోగాలు	526
ఎంఎస్ఎంఈలు	7,540
పెట్టుబడులు	749.25 కోట్లు
ఉద్యోగాలు	52,659
శ్రీసత్యసాయి జిల్లాలో	
పెద్ద ప్రాజెక్టులు	22
పెట్టుబడులు	రూ.14,970 కోట్లు
ఉద్యోగాలు	12,785
ఎంఎస్ఎంఈలు	1,532
పెట్టుబడులు	రూ.674 కోట్లు
ఉద్యోగాలు	11,312



లబ్ధిదారులకు స్వర్ణయుగం

వైఎస్సార్ సీపీ హయాంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని లబ్ధిదారులు స్వర్ణయుగం చూస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరిమహిళలు వంటివారికి నెలనెలా వేతనం తరహాలోనే వలంటీర్లు ఇంటికొచ్చి సొమ్ములిస్తున్నారు. రూ.2వేలతో పెన్షన్ మొదలై హామీ ఇచ్చిన మాదిరే రూ.2,750 వరకూ వెళ్లింది. వచ్చే జనవరిలో రూ.3 వేలకు పెంచుతానని ఇప్పటికే ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

అనంతపురం జిల్లాలో	
లబ్ధిదారుల సంఖ్య	2,76,640
నెలకు వ్యయం	రూ.77.283 కోట్లు
ఏడాదికి వ్యయం	రూ.857.96 కోట్లు
శ్రీసత్యసాయి జిల్లాలో	
లబ్ధిదారుల సంఖ్య	2,65,194
నెలకు వ్యయం	రూ.73.62 కోట్లు
ఏడాదికి వ్యయం	రూ.823.41 కోట్లు



ఆరోగ్యశ్రీకి మహర్దశ

ఆరోగ్యశ్రీకి జగన్ సర్కార్ ప్రాణం పోసింది. గతంలో ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న 1,058 చికిత్సలను ఇప్పుడు ఏకంగా 3,255కు పెంచింది. ఎక్కడా పైసా అడగకుండా చేసింది. ఇప్పుడు కాన్పులను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చడంతో గ్రామీణ మహిళలకు రూపాయి ఖర్చు లేకుండా పోయింది. కేన్సర్, గుండె, నరాల జబ్బులకు ఇతర రాష్ట్రాల్లోనూ వైద్యానికి అవకాశం కల్పించారు.

ఆరోగ్యశ్రీలో చికిత్సలు	3,255
నాలుగేళ్లలో లబ్ధిదారులు	1,96,165
ఖర్చు చేసిన వ్యయం	రూ.455.08 కోట్లు

అందరికీ పక్కా ఇళ్లు

టీడీపీ సర్కార్ టిడ్కో ఇళ్లపేరిట ప్రజలను మోసం చేసింది. జగన్ సర్కార్ ఇప్పుడు స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో జగనన్న కాలనీల పేరిట ఊళ్లకు ఊళ్లే వెలిశాయి. తాగునీళ్లు, రోడ్లు, కరెంటు ఇలా అన్నీ ఉచితంగా వేసి పేదలకు కొత్త కాలనీలు నిర్మిస్తున్నారు.

అనంతపురం జిల్లాలో	
మంజూరైన ఇళ్లు	60803
100 శాతం పూర్తయినవి	13500
రూఫ్ లెవెల్ ఉన్నవి	3వేలు
బేస్‌మెంట్ లెవెల్	19600
బేస్‌మెంట్ లెవెల్ కంటే తక్కువగా	20 వేలు
శ్రీసత్యసాయి జిల్లాలో	
జిల్లాలో మంజూరైన ఇళ్లు	66,965
నిర్మాణాలు ప్రారంభించినవి	62,253
పూర్తి అయినవి	10,717
గ్రౌండింగ్ అయినవి	54,878

యువకుడి బలవన్మరణం

అమరాపురం: పెళ్లికి తొందర ఏమొచ్చిందన్నందుకు మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అమరాపురం మండలం పి.శివరం గ్రామానికి చెందిన బేల్దారు లింగప్ప కుమారుడు పరమేశ్వర (25) పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తనకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులను తరచూ అడిగేవాడు. దీంతో ఇప్పుడే తొందరేందుకు, కొన్ని రోజులు ఆగాలని తల్లిదండ్రులు సూచించారు. దీంతో మనస్తాపం చెందిన పరమేశ్వర సోమవారం తమ పొలంలో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఏ ఒక్క విద్యార్థీ ఇబ్బంది పడకూడదు

- జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి

ప్రశాంతి నిలయం: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ఏ ఒక్క విద్యార్థీ ఇబ్బంది పడకుండా అన్ని కేంద్రాల్లోనూ వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి ఆదేశించారు. జూన్ 2 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. పరీక్షల నిర్వహణపై సోమవారం తన కార్యాలయంలో చీఫ్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో ఆమె సమీక్షించారు. ఎలాంటి తప్పిదాలు దొర్లినా ఆయా కేంద్రాల చీఫ్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. డిప్యూటీ డీఈఓ రంగస్వామి, డీసీఈబి సెక్రెటరీ భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

- కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి
- 'కలెక్టరేట్ స్పందన'కు 204 అర్జీలు
- 'పోలీసు స్పందన'కు 46 వినతులు

పుట్టపర్తి అర్బన్/కొత్తచెరువు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాలకు అందిన అర్జీలను గడువులోపు సంతృప్తికరమైన పరిష్కారం చేసేందుకు చొరవ తీసుకోవాలని జిల్లా అధికారులను కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంతో పాటు జిల్లా పోలీసుల కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వివిధ సమస్యలపై 204 అర్జీలను స్వీకరించారు. అర్జీల పరిష్కారంపై అనంతరం డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, డీపీఓ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీఈఓ మీనాక్షి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్‌ఖాన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డ్వామా పీడీ రామాంజనేయులు, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగ ప్రసాద్ పాల్గొన్నారు.

- జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 46 వినతులు అందాయి. ఇందులో ప్రేమ వివాహాలు చేసుకోవడంతో కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందని, అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. ప్రతి అర్జీని ఎస్పీ స్వయంగా పరిశీలించి, చట్టపరిధిలో ఉన్న సమస్యలకు తక్షణ పరిష్కారం చేపట్టాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. అదనపు ఎస్పీ ఎస్.విష్ణు, దిశ డీఎస్పీ వరప్రసాద్, ఎస్‌బీ సీఐ రవీంద్రారెడ్డి, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల లక్ష్యాన్ని పూర్తి చేయండి

పుట్టపర్తి అర్బన్: జిల్లాకు కేటాయించిన ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. జిల్లాలో ఇంకా 4,980 ఇళ్లు గ్రౌండింగ్ చేయాల్సి ఉందన్నారు. మరో ఏడు వారాల్లోపు వీటిని పూర్తి చేయాలన్నారు. బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న 7,375 ఇళ్ల నిర్మాణాలు రెండు వారాల్లో పూర్తి కావాలన్నారు. ఇంటి వద్ద లబ్ధిదారులతో ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే స్టేజి కన్వర్షన్ జరుగుతుందని, దీంతో లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్‌ఖాన్, జిల్లా కోఆర్డినేటర్ శివారెడ్డి, డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

పుట్టపర్తి అర్బన్/లేపాక్షి: సూక్ష్మ సేద్యంలో పరికరాల అమర్చే విధానంపై నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్నవారు 'ప్రాజెక్టు డైరెక్టర్, ఏపీఎంఐపీ, సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదురుగా, పుట్టపర్తి' చిరునామాకు దరఖాస్తును పోస్ట్ ద్వారా పంపాలి. పూర్తి సమాచారానికి 79950 10095, 63099 28360లో సంప్రదించవచ్చు.

270 మందికి అక్రిడిటేషన్లు

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ నిబంధనల మేరకు 2023-24 కాల పరిమితికి సంబంధించి తొలి విడతలో అర్హత ఉన్న 270 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం తన చాంబర్‌లో నిర్వహించిన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ఒక్క దరఖాస్తునూ తిరస్కరించబోమన్నారు. అక్రిడిటేషన్ మంజూరు కాని వారు రాష్ట్ర సమాచార శాఖ వెబ్‌సైట్‌లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం సదరు డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసి కాపీలను పుట్టపర్తిలోని జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. వీటిని పరిశీలించి రెండో విడతలో అక్రిడిటేషన్ మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీపీఆర్ఓ వేలాయుధం, డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, జిల్లా కార్మికశాఖ అధికారి సూర్యనారాయణ, ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు దివిటి రాజేష్, పుల్లయ్య, రామాంజులు, ఉదయభాను, ఏపీఆర్ఓ ఫక్రుద్దీన్, పీఆర్ఓ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి



కత్తిపోటుకు గురైన మల్లేష్

పరిగి: ఇద్దరి మధ్య చోటు చేసుకున్న ఘర్షణను నివారించేందుకు వెళ్లిన మూడో వ్యక్తి కత్తిపోటుకు గురై ఆస్పత్రి పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం ఊటుకూరులో ఆదివారం రాత్రి బాలకృష్ణతో నరసింహమూర్తి ఘర్షణ పడ్డాడు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న బాలకృష్ణ సోదరుడు మల్లేష్ వెంటనే నరసింహమూర్తిని అడ్డుకుని సర్దిచెప్పేందుకు ప్రయత్నించాడు. అప్పటికే తన వద్ద సిద్ధంగా ఉంచుకున్న కత్తిని తీసి నరసింహమూర్తి మల్లేష్‌పై విసరడంతో గొంతు భాగంలో దిగింది. తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిన మల్లేష్‌ను కుటుంబసభ్యులు వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యంకోసం కర్నూలుకు తరలించారు. ప్రస్తుతం మల్లేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మల్లేష్ భార్య గీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.